

మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 279 | పేజీలు : 8 | వెల : రూ.2/- | సోమవారం 02 నవంబర్ 2026 | వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

దీపావళికి ముందే ధరల బాదుడు

- వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై మరో రూ.10 పెంపు


2లో

నవంబర్‌లోనూ ఎండల తీవ్రత


● దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు ● వర్షపాతం లోటు తప్పదంటున్న భారత వాతావరణ శాఖ


2లో

దెబ్బతిన్న 48 గంటల్లో విద్యుత్ పునరుద్ధరణ

మురసు తుఫానును ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు

తెలంగాణ నుంచి 500 మంది సిబ్బంది రాక



అమరావతి,మన జనప్రగతి, నవంబర్ 01: మురసు తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ ముందస్తు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత జిల్లాలకు సిబ్బంది, యంత్రాలు, సామగ్రిని ముందుగానే తరలించాలని సూచించారు. విద్యుత్ వ్యవస్థ దెబ్బతిన్న 48 గంటల్లోనే మిగతా2లో...

ఢిల్లీ వీధుల్లో ఇండియా కూటమి గర్జన!

రాంలీలా మైదానంలో ఓట్ బచావోదేశ్ బచావో సభ

తెలుగు రాష్ట్రాల నుంచి 8 వేల మంది హాజరు


2లో

ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్


2లో

92 పట్టణ స్థానిక సంస్థల్లో ఓటింగ్ పూర్తి

తుది పోలింగ్ శాతం సోమవారం ప్రకటిస్తామన్న ఎన్నికల సంఘం

నవంబర్ 3న ఓట్ల లెక్కింపు.. 10,262 మంది అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్న ఓటర్లు

మోడీ పీఠం కూల్చే వరకు విశ్రమించం

● దేశంలో 20 కోట్ల ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర ● 'రాంలీలా' వేదిక సందేశాన్ని గ్రామాలకు తీసుకెళ్లండి: సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు



న్యూఢిల్లీ,మన జనప్రగతి, నవంబర్ 01: నరేంద్ర మోడీని ఓడించేందుకు కాంగ్రెస్ వానర సైన్యం పోరాడుతోందని, ఈ పోరాటంలో విజయం సాధించే వరకు విశ్రమించబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిజ్ఞ చేశారు. తెలంగాణ నుంచి వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను వానర సైన్యంగా అభివర్ణించారు. 'ఓట్ బచావోదేశ్ బచావో' నినాదంతో బీజేపీ నేతలకు గట్టి సందేశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. రాంలీలా మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభ సందేశాన్ని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కులాలు, మతాల పేరుతో ప్రజలను విభజించి మోడీ రెండుసార్లు అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లు రద్దు చేయాలని భావించారని విమర్శించారు. అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును తొలగించేందుకు ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికే 13.50 కోట్ల ఓట్లు తొలగించారని, మరో 20 కోట్ల ఓట్లు తొలగించేందుకు కుట్ర జరుగుతోందని అన్నారు. ఓట్ల తొలగింపు ద్వారా బీజేపీ పలు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ 'ఓట్ బచావోదేశ్ బచావో' ర్యాలీ రాబోయే సార్వత్రిక ఎన్నికలకు నాంది అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ చేస్తున్న పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ మిగతా2లో...

పోలింగ్ కేంద్రాల్లో ప్రజాస్వామ్యం ఖూనీ: జగన్

● ఓటర్ల అడ్డగింత.. వైసీపీ ఏజెంట్లు, అభ్యర్థులపై దాడులు ● బూత్‌లలో ఏజెంట్లు లేకుండా ఎన్నికలా? మీడియాపైనా దాడులు జరిగాయి: జగన్


2లో

రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ కారణం: కేటీఆర్

కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోయకపోవడంతోనే రాష్ట్రంలో కరవు పరిస్థితులు

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ



ఆదిలాబాద్, మన జనప్రగతి, నవంబర్ 01: రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో నిర్వహించిన రైతు గర్జన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులు ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడినవి కావని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, ముందు చూపు లేని పాలన ఫలితమని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. సుమారు 35 లక్షల ఎకరాల్లో వానాకాలం పంటకు నష్టం వాటిల్లిందని, 750 టీఎంసీల నీటిని వృథాగా మిగతా2లో...


2లో

ఓబీసీ కులగణనపై అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలి

ఆదివాసీల మత నమోదుకు ప్రత్యేక కాలమ్ కోసం తీర్మానం చేయాలి.. సీఎం రేవంత్‌కు కవిత బహిరంగ లేఖ

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

02 - 11 - 2026

ఢిల్లీ వీధుల్లో ఇండియా కూటమి గర్జన!

న్యూఢిల్లీ, మన జనప్రగతి, నవంబర్ 01: ఇండియా కూటమి నిర్వహించిన 'ఓట్ బచావోదేశ్ బచావో' భారీ బహిరంగ సభతో ఢిల్లీ జనసంద్రమైంది. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు, నిరసనకారులతో రాంలీలా మైదానం, కన్నాట్ ప్లేస్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. మధ్యాహ్నం మింటో రోడ్ జంక్షన్ నుంచి సభా ప్రాంగణం వరకు నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. 'ఓట్ బచావోదేశ్ బచావో', 'ఓట్ చోర్‌గద్దీ ఛోడ్' నినాదాలతో మద్దతుదారులు హోరెత్తించారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసం నుంచి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తదితర నేతలు ఓపెన్ టాప్ వాహనాల్లో ర్యాలీకి చేరుకున్నారు. ప్రియాంకాగాంధీ, ఫరూక్ అబ్దుల్లా, తేజస్వి యాదవ్, సంజయ్ రౌత్, సుప్రియా సూలే తదితరులు కూడా పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా వివిధ రాష్ట్రాల మద్దతుదారులు సంప్రదాయ దుస్తులు, జానపద నృత్యాలు, డప్పు వాయిద్యాలతో నిరసన తెలిపారు. **తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలింపు** సభకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 8 వేల మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి చేరుకున్నారు. దీంతో తెలంగాణ, ఏపీ భవన్‌లు కిటకిటలాడాయి. తెలంగాణ భవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ నాయకురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ సమయంలో సీపీఐ నేత డి. రాజా అస్వస్థతకు గురికాగా, రాహుల్‌గాంధీ తన కాన్వాయ్‌ను నిలిపి ఆయనను ఆస్పత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. భారీ సభ నేపథ్యంలో ఢిల్లీ వ్యాప్తంగా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. సుమారు 10 వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు.

ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్

అమరావతి,మన జనప్రగతి, నవంబర్ 01: ఆంధ్రప్రదేశ్‌లో 92 పట్టణ స్థానిక సంస్థలకు ఆదివారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5 గంటలకు పూర్తయింది. నిర్ణీత సమయానికి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 99.35 లక్షల మంది ఓటర్ల కోసం 11,378 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3 గంటల వరకు 48.03 శాతం పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా వెల్లడించారు. సాయంత్రం 5 గంటల తర్వాత పోలింగ్ సిబ్బంది నుంచి పూర్తి వివరాలు అందిన అనంతరం తుది పోలింగ్ శాతాన్ని ప్రకటిస్తామని తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ 55వ డివిజన్‌లో సాంకేతిక కారణాలతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభం కావడంతో రాత్రి 7.30 గంటల వరకు ఓటింగ్‌కు అనుమతించారు. **చెదురుమదురు ఘటనలు.. 275 కేసులు** కడప, కర్నూలు, పల్నాడు, అనంతపురం జిల్లాల్లో కొన్ని చోట్ల స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. పోలింగ్ సందర్భంగా సుమారు 40 ఘటనలు నమోదైనట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు 275 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు వెల్లడించారు. వివిధ రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, ఆధారాల మేరకు చర్యలు తీసుకుంటామని ఎన్నికల కమిషనర్ స్పష్టం చేశారు.**3న ఓట్ల లెక్కింపు** ఈ ఎన్నికల్లో మేయర్, చైర్‌పర్సన్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసిన 10,262 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ పెట్టెల్లో భద్రంగా ఉంది. నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ప్రజాస్వామ్యం ఖూనీ: జగన్

ఓటర్ల అడ్డగింత.. వైసీపీ ఏజెంట్లు, అభ్యర్థులపై దాడులు

బూత్‌లలో ఏజెంట్లు లేకుండా ఎన్నికలా? మీడియాపైనా దాడులు జరిగాయి: జగన్



పులివెందుల, మన జనప్రగతి, నవంబర్ 01:పోలీసుల సహకారంతో టీడీపీ నాయకులు పోలింగ్ కేంద్రాలను ఆక్రమించి ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు లేకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఆదివారం పులివెందుల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తన నివాసంలో మీడియాతో మాట్లాడారు.తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే పలు పోలింగ్ కేంద్రాలను టీడీపీ కార్యకర్తలు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. వైసీపీ ఏజెంట్లను కేంద్రాల్లోకి అనుమతించడం లేదని, ఓటు వేసేందుకు వచ్చిన వారిని ఇప్పటికే ఓటు వేశారంటూ వెనక్కి పంపుతున్నారని తెలిపారు. వైసీపీ చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మపై దాడి చేశారని, కౌన్సిలర్ అభ్యర్థులను పోలీసులు స్టేషన్‌కు తరలించారని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధులపైనా దాడులు జరిగినట్లు ఆరోపించారు.ఈ ఘటనలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు జగన్ తెలిపారు. సుమారు 70 మంది ఏజెంట్లతో కలిసి మున్సిపల్ రిటర్నింగ్ అధికారిని కలసి ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. పులివెందులతో పాటు కడప, జమ్మలమడుగు, మదనపల్లె, తాడిపత్రి, చీమకుర్తి మున్సిపాలిటీల్లోనూ దౌర్జన్యాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని పేర్కొంటూ, ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుపై జగన్ తీవ్ర విమర్శలు చేశారు.

మొంథా తుఫాన్ ఎఫెక్ట్.. తెలంగాణకు భారీ వర్ష సూచన!

ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.. మరో ఐదు జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్‌లోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం



హైదరాబాద్,మన జనప్రగతి, నవంబర్ 01: బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుఫాన్ ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే అక్టోబర్ 28న 'అర్నబ్' తుఫాన్ తీరం దాటగా, వారం రోజులు గడవకముందే మరో తుఫాన్ ప్రభావం రాష్ట్రంపై పడనుంది. సోమ, మంగళవారాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.**ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్** మొంథా తుఫాన్ ప్రభావంతో ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.**మంగళవారం అత్యంత భారీ వర్షాలు**మొంథా తుఫాన్ నెల్లూరునర్సాపూర్ మధ్య దక్షిణ కోస్తాంధ్ర తీరాన్ని సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయంలోపు దాటే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. తీరాన్ని దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. మంగళవారం ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. **హైదరాబాద్‌లోనూ వర్షాలు**రాజధాని హైదరాబాద్‌లో వచ్చే 48 గంటల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. బుధ, గురువారాల్లోనూ పలు జిల్లాల్లో వర్షాలు కొనసాగవచ్చని వెల్లడించింది. ప్రజలు వాతావరణ శాఖ సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

దీపావళికి ముందే ధరల బాదుడు

న్యూఢిల్లీ, మన జనప్రగతి, నవంబర్ 01:దీపావళి పండుగకు ముందే వాణిజ్య గ్యాస్ ధరలు పెరిగాయి. 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్‌పై రూ.10 పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. నవంబర్ 1 నుంచి పెరిగిన ధరలు అమల్లోకి వచ్చాయి. దీంతో ఢిల్లీలో సిలిండర్ ధర రూ.2,820కు, హైదరాబాద్‌లో రూ.3,065కు చేరింది. వరుసగా మూడు నెలలుగా ధరలు పెరుగుతుండటంతో హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులపై అదనపు భారం పడనుంది. గృహావసరాల వంటగ్యాస్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు.

నవంబర్‌లోనూ ఎండల తీవ్రత

న్యూఢిల్లీ, మన జనప్రగతి, నవంబర్ 01:దేశంలో నవంబర్ నెలలోనూ ఎండల తీవ్రత కొనసాగనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. సాధారణంగా ఈ సమయంలో చలి ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని అంచనా వేసింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా పలు ప్రాంతాల్లో అధికంగా ఉండనున్నాయని తెలిపింది. అక్టోబర్ 31న విడుదల చేసిన నెలవారీ వాతావరణ అంచనాల ప్రకారం హిమాలయ పర్వత ప్రాంతాల దిగువన ఉన్న కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా చోట్ల ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. మరోవైపు నవంబర్‌లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. దీర్ఘకాల సగటు వర్షపాతంలో కేవలం 77 శాతం మాత్రమే నమోదయ్యే సూచనలు ఉన్నాయని పేర్కొంది. దక్షిణ భారతదేశంలోనూ ఇదే పరిస్థితి ఉండనుందని, సాధారణంగా 118.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే ప్రాంతంలో ఈసారి 77 శాతం మాత్రమే వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో బలమైన ఎల్‌నినో పరిస్థితులు కొనసాగుతున్నాయని, నవంబర్, డిసెంబర్ నెలల్లోనూ ఇవి కొనసాగవచ్చని తెలిపింది. ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాల్లో తీవ్ర కరవు, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ వివరించింది.

దెబ్బతిన్న 48 గంటల్లో విద్యుత్ పునరుద్ధరణ

(మొదటి పేజీ తరువాయి)

సరఫరాను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు.విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉన్నతాధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. అవసరమైతే తెలంగాణ, తమిళనాడు నుంచి అదనపు సిబ్బంది, పరికరాలను తెప్పించాలని సూచించారు. ఇప్పటికే తెలంగాణ నుంచి 500 మంది సిబ్బంది వచ్చినట్లు మంత్రి తెలిపారు. తమిళనాడు కూడా సహకరించేందుకు అంగీకరించిందన్నారు.తుఫాను సహాయక చర్యల కోసం తమిళనాడు సీఎం విజయ్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. విద్యుత్ పునరుద్ధరణకు సిబ్బంది, యంత్రాలు పంపాలని కోరారు. సోమవారం నుంచి ప్రతి నాలుగు నుంచి ఆరు గంటలకు తుఫాను పరిస్థితులపై బులెటిన్లు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు.

మోడీ పీఠం కూల్చే వరకు విశ్రమించం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాలకు అనుగుణంగా ఎన్నికల సంఘం పనిచేస్తోందని విమర్శించారు. ఓటరు జాబితా సవరణ పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కును తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ఓటు చోరీ వ్యవహారంలో ప్రధాని మోడీ పాత్ర ఉందని ఆరోపించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సైతం ఓటర్ల జాబితాలో అక్రమాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే పిలుపు మేరకు ఢిల్లీలో నిర్వహించిన తెలంగాణ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ కారణం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

సముద్రంలోకి వదిలేశారని విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని కేటీఆర్ ఆరోపించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరాకు ఏటా రూ.15 వేల పెట్టుబడి సాయం, రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. మరోవైపు యూరియా కొరత, విద్యుత్ సమస్యలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. సాగునీరు, పెట్టుబడి సాయం, ఎరువులు సకాలంలో అందక రైతులు నష్టాల పాలవుతు న్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వాటిని పట్టించు కోకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతుల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు సభకు ముందు కేటీఆర్ నేరడిగొండ, తలమడుగు మండలాల్లో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. రైతుల సంక్షేమం, సాగునీటి సమస్యలు, పంట నష్టాలకు పరిహారం వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ రైతు గర్జన సభలో మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓబీసీ కులగణనపై అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలి

● ఆదివాసీల మత నమోదుకు ప్రత్యేక కాలమ్ కోసం తీర్మానం చేయాలి.. సీఎం రేవంత్‌కు కవిత బహిరంగ లేఖ

హైదరాబాద్,మన జనప్రగతి, నవంబర్ 01:జనగణనలో ఓబీసీల కులగణన కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని, ఆదివాసీల మత నమోదుకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదివారం బహిరంగ లేఖ రాశారు. డిసెంబర్ నుంచి ఇంటింటి జనగణన ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ అంశాలపై చర్చించేందుకు రాష్ట్ర శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఓబీసీల జనాభాపై చట్టబద్ధమైన లెక్కలు లేకపోవడంతో వారికి జనాభా దామాషా ప్రకారం ప్రయోజనాలు అందడం లేదని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీల తరహాలో ఓబీసీల జనాభాను కూడా ప్రత్యేకంగా లెక్కించాలని సూచించారు. అలాగే ఆదివాసీల ప్రత్యేక జీవనశైలి, సంప్రదా యాలను గుర్తించి వారి మత నమోదుకు జనగణనలో ప్రత్యేక కాలమ్ కల్పించాలని కోరారు. ఈ రెండు అంశాలపై వేర్వేరు తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కవిత తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

మాజీ సీఎం కాన్వాయ్‌కు అడ్డంగా దస్తగిరి వాహనం... ఉద్రిక్తత

● పోలీసులు, వైసీపీ వర్గీయుల ఆగ్రహం ● స్కార్పియో వాహనం ధ్వంసం



పులివెందుల, మన జనప్రగతి, నవంబర్ 01:- పులివెందులలో మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి కాన్వాయ్‌కు దస్తగిరికి చెందిన స్కార్పియో వాహనం అడ్డుగా నిలవడంతో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. మాజీ సీఎం జగన్ హెలిప్యాడ్ నుంచి క్యాంపు కార్యాలయానికి వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. వివేకానంద రెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరికి చెందిన స్కార్పియో వాహనం జగన్ కాన్వాయ్‌కు అడ్డంగా నిలిచినట్లు సమాచారం. దీంతో అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు, వైసీపీ వర్గీయులు వాహనం వద్దకు చేరుకుని అడ్డుకున్నారు. ఈ క్రమంలో స్కార్పియో వాహనం ధ్వంసమైనట్లు సమాచారం. అనంతరం వాహనాన్ని అక్కడి నుంచి వెనక్కి పంపించారు. ఈ ఘటనతో హెలిప్యాడ్ పరిసర ప్రాంతంలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే పులివెందులలో రాజకీయ వాతావరణం వేడెక్కిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

ప్రశాంతంగా జరుగుతున్న పోలింగ్‌లో అలజడి సృష్టించారు

● వైఎస్ జగన్, ఎంపీ అవినాష్ రెడ్డిపై బీటెక్ రవి ఆరోపణలు



పులివెందుల, మన జనప్రగతి, నవంబర్ 01:- పులివెందులలో ప్రశాంతంగా కొనసాగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సమయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి వ్యవహారశైలితో ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగిందని టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి ఆరోపించారు. ఆదివారం మధ్యాహ్నం పులివెందుల మున్సిపల్ కార్యాలయం వద్ద బీటెక్ రవి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రశాంతంగా సాగుతున్న పోలింగ్‌ను కావాలనే వివాదాస్పదం చేస్తున్నారని విమర్శించారు. ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన వారు ఓటు వేసి వెళ్లాలే తప్ప, ఇతరులను రెచ్చగొట్టేలా వ్యవహరించకూడదని అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ఆందోళన కారణంగా రిటర్నింగ్ అధికారి విధులకు ఆటంకం కలిగిందని బీటెక్ రవి పేర్కొన్నారు. ఫిర్యాదుల కోసం కార్యాలయానికి వచ్చే వారికి కూడా ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. సుమారు రెండు గంటలకు పైగా జగన్, ఆయన అనుచరులు అక్కడే ఉండటంతో ఎన్నికల విధులకు అంతరాయం ఏర్పడిందని ఆరోపించారు. మరోవైపు ధర్నా పేరుతో మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన కొనసాగిస్తూనే, ఇతర ప్రాంతాల్లో ఓట్ల రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. కౌన్సిలర్ అభ్యర్థుల ఏజెంట్లను మాత్రమే పిలిపించుకుని, మిగిలిన ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియ యథావిధిగా కొనసాగుతున్నట్లు చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడం సరికాదని, పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని బీటెక్ రవి కోరారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట వైఎస్ ప్రమీలమ్మ ధర్నా




పులివెందుల, మన జనప్రగతి, నవంబర్ 01: పులివెందుల మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వైఎస్సార్‌సీపీ చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. కూటమి నాయకులు పోలింగ్ కేంద్రాల్లో తమ పార్టీ ఏజెంట్లను బలవంతంగా బయటకు పంపిస్తున్నారని, దొంగ ఓట్లు వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. ఈ అంశాలపై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసేందుకు వైఎస్ ప్రమీలమ్మతో పాటు నామినేషన్లు దాఖలు చేసిన పలువురు అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అయితే, ఫిర్యాదులు స్వీకరించాల్సిన ఎన్నికల అధికారులు అందుబాటులో లేకపోవడంతో వారు అసహనం వ్యక్తం చేశారు. తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నిస్తూ ప్రమీలమ్మతో పాటు అభ్యర్థులు కార్యాలయం బయట నిరసన చేపట్టారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత పాటించాలని, తమ ఫిర్యాదులను వెంటనే స్వీకరించి ఆరోపణలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పులివెందులలో వాహనాలకు నిప్పు.. తీవ్ర ఉద్రిక్తత

- 3 కార్లు, 11 బైకులు, ట్రాక్టర్ ట్రాలీ దగ్ధం





పులివెందుల, మన జనప్రగతి, నవంబర్ 01:- పులివెందుల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానిక శిల్పారామం సమీపంలోని ఓ తోటలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పలు వాహనాలకు నిప్పంటించారు. ఈ ఘటనలో మూడు కార్లు, 11 ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్ ట్రాలీ అగ్నికి ఆహుతయ్యాయి. ఉలిమెల గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డికి చెందిన పొలంలోని నివాసం వద్ద వాహనాలను నిలిపి ఉంచారు. శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వాటికి నిప్పంటించినట్లు సమాచారం. మంటలు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే సుమారు ఎనిమిది వాహనాలు పూర్తిగా లేదా తీవ్రంగా దెబ్బతిన్నట్లు సమాచారం. మిగిలిన వాహనాలకు కూడా నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. వాహనాలకు నిప్పంటించిన ఘటనపై దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు గల కారణాలు, నిందితుల వివరాలు తెలియాల్సి ఉంది. మున్సిపల్ ఎన్నికల వేళ వరుస ఉద్రిక్త పరిణామాల నేపథ్యంలో ఈ ఘటన పులివెందులలో చర్చనీయాంశంగా మారింది.

పోలీసుల సహకారంతో పోలింగ్ కేంద్రాలను ఆక్రమించారు

ఓటర్లను అడ్డుకున్నారు

బూతుల్లో ఏజెంట్లు లేకుండా ఎన్నికలా

మీడియాపైనా దాడి చేశారంటూ జగన్ ఆరోపణలు

వైసీపీ ఏజెంట్లు, అభ్యర్థులపై దాడులు



పులివెందుల, మన జనప్రగతి, నవంబర్ 01:- పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు లేకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రశ్నించారు. పోలీసుల అండతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పోలింగ్ కేంద్రాలను ఆక్రమించి ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆదివారం పులివెందుల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పట్టణానికి వచ్చిన వైఎస్ జగన్ తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే పలు పోలింగ్ కేంద్రాలను టీడీపీ కార్యకర్తలు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. తాను ఓటు వేసే పోలింగ్ కేంద్రంలో మాత్రమే ఏజెంట్లు ఉన్నారని, మిగిలిన కేంద్రాల్లో వైసీపీ ఏజెంట్లను అనుమతించడం లేదని విమర్శించారు. వైసీపీ చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మపై దాడి చేశారని, ఓటు వేయడానికి వచ్చిన వారిని ఇప్పటికే ఓటు వేశారంటూ వెనక్కి పంపుతున్నారని జగన్ పేర్కొన్నారు. మరికొన్ని చోట్ల ఓటు వేయడానికి వెళ్లిన ఓటర్లపై దాడులు జరిగాయని, కౌన్సిలర్ అభ్యర్థులను పోలీసులు స్టేషన్‌కు తరలించారని ఆరోపించారు. మీడియా ప్రతినిధులపైనా దాడులు జరిగినట్లు తెలిపారు. ఈ పరిణామాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, సుమారు 70 మంది ఏజెంట్లతో కలిసి మున్సిపల్ రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లి ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం అమలు చేయకుండా ఎన్నికలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. పులివెందుల, కడప, జమ్మలమడుగు, మదనపల్లె, తాడిపత్రి, చీమకుర్తి మున్సిపాలిటీల్లో చోటుచేసుకున్నాయని చెబుతున్న దౌర్జన్యాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ పరిణామాలను చూస్తున్నప్పటికీ తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఎన్నికల సమయంలో ఇలాంటి పరిస్థితులు కొనసాగితే రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించే పరిస్థితి ఉండదని జగన్ అన్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికార పార్టీతో పాటు అధికార యంత్రాంగంపై ఉందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇంతటి దారుణాలకు పాల్పడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కరోజు కూడా ముఖ్యమంత్రి పదవిలో కొనసాగడానికి అర్హుడు కాదని జగన్ తీవ్రంగా వ్యాఖ్యానించారు.

మీడియా ప్రతినిధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత

జర్నలిస్టుపై దాడి ఘటనలో కేసు నమోదు

సీసీ కెమెరాలు, డ్రోన్ దృశ్యాలతో నిందితుల గుర్తింపు: ఎస్పీ షెల్కే నచికేత్



కడప, మన జనప్రగతి, నవంబర్ 01:- జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టామని, విధి నిర్వహణలో ఉన్న మీడియా ప్రతినిధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనాతో కలిసి ఎస్పీ మాట్లాడారు. పులివెందులలో జర్నలిస్టుపై దాడి చేసి కెమెరా ధ్వంసం చేసిన ఘటనపై వెంటనే కేసు నమోదు చేశామని, బాధిత పాత్రికేయుడికి వ్యక్తిగత భద్రత కల్పించినట్లు వెల్లడించారు. సీసీ కెమెరాలు, డ్రోన్ దృశ్యాలను పరిశీలించి బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. **హెలికాప్టర్ ల్యాండింగ్‌కు భద్రతా ఏర్పాట్లు**మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హెలికాప్టర్ ల్యాండింగ్ సమయం మారినప్పటికీ, జెడ్ ప్లస్ భద్రతా నిబంధనల ప్రకారం అవసరమైన ఏర్పాట్లు చేశామని ఎస్పీ తెలిపారు. అదే సమయంలో మున్సిపల్ ఎన్నికల విధులకు ఆటంకం కలగకుండా పోలీసు సిబ్బందిని సమన్వయం చేసి హెలికాప్టర్ సురక్షితంగా ల్యాండ్ అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. **ప్రశాంతంగా పోలింగ్**పులివెందులతో పాటు జిల్లాలోని ఏడు పట్టణ స్థానిక సంస్థల్లో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగిందని, కొన్ని చిన్నపాటి ఘటనలు మినహా పెద్దగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తలేదని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే అవాస్తవ ప్రచారాలను నమ్మవద్దని, పాత్రికేయులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వహించేందుకు పోలీసు శాఖ పూర్తి భద్రత కల్పిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు.

పులివెందులలో పోలింగ్ వేళ ఉద్రిక్తత

పలుచోట్ల ఘర్షణలు!


వాహనాలకు నిప్పు.. చైర్మన్ అభ్యర్థి కారుపై రాళ్లదాడి

ఓటు హక్కు కోసం రోడ్డెక్కిన ఓటర్లు

టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వాగ్వాదాలు

పోలీసుల జోక్యంతో అదుపులోకి పరిస్థితులు





పులివెందుల, మన జనప్రగతి, నవంబర్ 01:- పులివెందుల మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పట్టణంలో పలు చోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వాహనాలకు నిప్పంటించిన ఘటనతో ప్రారంభమైన అలజడి, ఆదివారం పోలింగ్ సమయంలో ఘర్షణలు, రాళ్లదాడులు, ఓటర్ల నిరసనలతో మరింత తీవ్రరూపం దాల్చింది. పలు పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకోగా, ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన కొందరు ఓటర్లు కూడా నిరసనలకు దిగారు. దీంతో పోలీసులు పలుచోట్ల జోక్యం చేసుకుని పరిస్థితులను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు. పట్టణంలోని శిల్పారామం సమీపంలో ఉన్న ఓ తోటలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వాహనాలకు నిప్పంటించారు. ఉలిమెల గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డికి చెందిన పొలంలోని నివాసం వద్ద నిలిపి ఉంచిన 11 ద్విచక్ర వాహనాలు, మూడు కార్లు, ఒక ట్రాక్టర్ ట్రాలీకి నిప్పు పెట్టారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే సుమారు ఎనిమిది వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం పోలింగ్ సందర్భంగా బాలికల జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించేందుకు వెళ్లిన వైసీపీ చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీల కారుపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. చైర్మన్ అభ్యర్థి తరఫున జనరల్ ఏజెంట్‌గా ఉన్న కొమ్మద్ది నరసింహారెడ్డిపై కూడా దాడి జరిగినట్లు సమాచారం. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఎర్రగుడిపాలెంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లను పోలింగ్ కేంద్రంలోకి అనుమతించడం లేదంటూ నిరసన వ్యక్తమైంది. దీంతో వైసీపీ నేత చవ్వా దుష్యంత్ రెడ్డి, చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీల అక్కడికి చేరుకుని ఓటర్లను అనుమతించాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. సమాచారం అందుకున్న సీఐ నరసింహులు, ఎస్ఐ తిమోతి అక్కడికి చేరుకుని ఓటర్లను పోలింగ్ కేంద్రంలోకి పంపిస్తామని, నాయకులు అక్కడి నుంచి వెళ్లాలని సూచించారు. శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించడంతో దుష్యంత్ రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం పోలీసులు ఓటర్లను ఓటు వేసేందుకు అనుమతించారు. జేఎన్‌టీయూ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద జయమ్మ కాలనీ, కొండారెడ్డి కాలనీలకు చెందిన మహిళలు తమను ఓటు వేసేందుకు అనుమతించాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులుగా ఉండకూడదని పోలీసులు సూచించారు. ఇద్దరు, ముగ్గురి చొప్పున వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ క్రమంలో దాదాపు గంటకు పైగా వాగ్వాదం కొనసాగింది. గాడిచర్ల వారి వీధిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 8, 9, 10 పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ, వైసీపీ వర్గీయులు పరస్పరం రాళ్లు రువ్వుకున్నట్లు సమాచారం. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొనగా పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. చిన్నన్న రూముల వద్ద వైసీపీ ఏజెంట్ సునందను పోలింగ్ కేంద్రంలోకి అనుమతించకపోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో సునంద కిందపడటంతో ఆమె కుడిచేతికి ఫ్రాక్చర్ అయినట్లు సమాచారం. అహోబిలాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద కూడా ఓటర్లు తమకు ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దాదాపు గంటకు పైగా ఆందోళన కొనసాగింది. పెద్ద రంగాపురం గ్రామంలోని ఒకటో వార్డులోనూ ఓటు వేసేందుకు అనుమతించాలని వైసీపీ వర్గీయులు నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు, పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో తమ అభ్యర్థులను, ఏజెంట్లను టీడీపీ వర్గీయులు అనుమతించడం లేదని, ఓటు హక్కు వినియోగించుకోవడంలోనూ అడ్డంకులు ఎదురవుతున్నాయని వైసీపీ వర్గీయులు ఆరోపించారు. దీనికి భిన్నంగా టి.వెలమవారిపల్లి, వెంకటాపురం పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ వర్గీయులు రిగ్గింగ్‌కు పాల్పడుతున్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. ఈ ఆరోపణలపై అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. పోలింగ్ సందర్భంగా చోటుచేసుకున్న వరుస ఘటనలతో పులివెందులలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఓటర్ల నిరసనలు, రాజకీయ వర్గాల మధ్య ఘర్షణలు, పరస్పర ఆరోపణల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు, డీఎస్పీ మురళి నాయక్, సీఐలు శంకర్ రెడ్డి, పురుషోత్తం రాజు, శాంతిలాల్, నరసింహులు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పలుచోట్ల పర్యటించి పరిస్థితులను సమీక్షిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టారు.

కారు ఢీకొని ఇద్దరు మహిళలు మృతి

కొండాపురం, మన జనప్రగతి, నవంబర్ 01:- కొండాపురం గ్రామంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. కూలి పనులకు వెళ్లి తిరిగి వస్తున్న మహిళలను తాడిపత్రి నుంచి ముద్దనూరు వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిలో ఒక మహిళ సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, మరో మహిళను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆమె కూడా మృతి చెందింది. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు మృతి చెందడంతో కొండాపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వారి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఓటర్లను కలిసిన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ



పత్తికొండ, మన జనప్రగతి, నవంబర్ 01:- పత్తికొండ పట్టణంలోని ఎంపీటీసీ-5 పరిధిలో ఉన్న టీచర్స్ కాలనీలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 5వ తేదీన జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి పార్టీ అభ్యర్థుల విజయానికి సహకరించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి కాలనీలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రచార కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినిపై దాడి ఘటన తీవ్రంగా కలచివేసింది

- మాజీ ఆప్కాస్ బోర్డు మెంబర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి



పోరుమామిళ్ల, మన జనప్రగతి నవంబర్ 01:- అనంతపురము జిల్లా రాప్తాడు ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని గోపికపై శనివారం జరిగిన అమానుష దాడి ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని, కలచివేసిందని మాజీ ఆప్కాస్ బోర్డు మెంబర్, పోరుమామిళ్ల డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. తరగతి గదిలో వున్న విద్యార్థినిపై దుండగుడు అకస్మాత్తుగా దూసుకువచ్చి కలప కోసే పెట్రోల్ రంపంతో దాడి చేసి తీవ్రంగా గాయపరచడం హృదయ విదారకమని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలని అన్నారు. విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు, పోలీసుల అదుపులో వున్న నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని, పోలీస్ అధికారులను కోరారు. ఇలాంటి అనాగరిక ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి విజ్ఞప్తి చేశారు.

ఏటి గంగమ్మ అమ్మవారికి మహిళల బోనాల సమర్పణ



సిద్ధవటం, మన జనప్రగతి, నవంబర్ 01:- మండలంలోని పెద్దపల్లి పంచాయతీ పరిధి భాకరాపేట గ్రామ శివారులో కొలువై ఉన్న ఏటి గంగమ్మ అమ్మవారికి ఆదివారం మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహకుడు మునిగాళ్ల సుబ్బయ్య మాట్లాడుతూ, వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు మేలు జరగాలనే ఆకాంక్షతో మహిళలు ఏటి గంగమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రీపోలింగ్ నిర్వహిస్తేనే ఓటు వేస్తా.. లేదంటే వేయను

- పులివెందుల ఎన్నికల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన వైఎస్ జగన్



పులివెందుల, టౌన్ మన జనప్రగతి, నవంబర్ 01:- పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో తాను ఓటు వేయబోనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. ఎన్నికలు న్యాయంగా, పారదర్శకంగా జరిగేలా రీపోలింగ్ నిర్వహిస్తేనే తాను ఓటు హక్కును వినియోగించుకుంటానని స్పష్టం చేశారు.ఆదివారం పులివెందులలో చోటుచేసుకున్న ఎన్నికల పరిణామాలపై స్పందించిన జగన్, పట్టణంలో ఎన్నికల నిర్వహణ తీరు సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఓటు వేయడం ద్వారా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగిందనే సంకేతం ప్రజల్లోకి వెళ్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందుకే తాను ఓటు వేయకూడదని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.పులివెందులలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై తమ పార్టీ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ, న్యాయబద్ధంగా రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.కాగా, పులివెందుల మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై వైఎస్సార్‌సీపీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో జగన్ ఓటు వేయబోనంటూ చేసిన ప్రకటన రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థుల గెలుపునకు విస్తృత ప్రచారం



దేవనకొండ, మన జనప్రగతి, నవంబర్ 01:-కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం దేవనకొండ మండలంలోని పి.కోటకొండ, కే.వెంకటాపురం గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బూసినే, దేవనకొండ మండల ఎంపీపీ అభ్యర్థి కప్పట్రాళ్ల దివాకర్ నాయుడు తల్లి, జెడ్పీటీసీ అభ్యర్థి వేదావతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దేవనకొండ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు.ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో దేవనకొండ మండల పార్టీ నాయకులు, జెడ్పీటీసీ అభ్యర్థి, కప్పట్రాళ్ల దివాకర్ నాయుడు అభిమానులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వెంకటరెడ్డిపల్లిలో జనసేన అభ్యర్థుల తరపున ముక్కా రూపానందరెడ్డి విస్తృత ప్రచారం

- ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటా ప్రచారం



రైల్వేకోడూరు,మన జనప్రగతి నవంబర్ 01:- రైల్వేకోడూరు మండలంలోని వెంకటరెడ్డిపల్లిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో రెండో విడత ఎన్నికల ప్రచార కార్యక్రమంలో రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి విస్తృతంగా పాల్గొన్నారు.జనసేన పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి కొండేటి వెంకటరమణ, జడ్పీటీసీ అభ్యర్థి పగడాల వెంకటేష్‌లకు మద్దతుగా ఆయన గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేస్తూ, వారి ఎన్నికల గుర్తులు, గాజు గ్లాస్ పై ఓటు వేసి గెలిపించాలని కొరారు .అలాగే పోటీ చేస్తున్న స్థానాల గురించి వివరిస్తూ మద్దతు కోరారు.ఈ సందర్భంగా గ్రామంలోని ఓటర్లతో మమేకమవుతూ అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో మెగా నేత్ర చికిత్స



రాయచోటి మన జనప్రగతి నవంబర్ 01:- స్థానిక హరినాధ వీధి నందు ఉన్న రాయచోటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు తిరుపతి అరవింద్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర చికిత్స శిబిరం ఏర్పాటు చేయడము జరిగిందని అధ్యక్షులు లయన్ రామాంజనేయరెడ్డి తెలియజేశారు. అనంతరం డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వారు రాయచోటి పట్టణం నందు చాలా సేవా కార్యక్రమాలు చేస్తూ లయన్స్ జిల్లాలో మంచి గుర్తింపు పొందిందని అలాగే ఇక్కడ జరిగే నేత్ర చికిత్స శిబిరాన్ని ఉపయోగించుకొని ప్రతి నెల మొదటి ఆదివారం అధిక సంఖ్యలో వచ్చి కంటికి ఏ సమస్య లేకుండా చూసుకోవాలని తెలియజేశారు.అనంతరం వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పి.ఎస్ హరినాథ్ రెడ్డి మరియు ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించిన లయన్ మిక్కిలినేని ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గం లో కంటి చూపుతో ఎవరు ఇబ్బంది పడకుండా అందరూ బాగుండాలనె ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని ప్రజలందరూ ఉపయోగించుకొవాలని,అలాగే ఈ కార్యక్రమంలో 74 మంది కంటి పరీక్షలు చేయడం జరిగిందని 13 మంది కి ఆపరేషన్ నిమిత్తం తిరుపతి కీ తీసుకొని పోవడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్,లయన్ సురేష్,రాయచోటి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ బృందం మరియు తిరుపతి అరవింద్ హాస్పిటల్ బృందం తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో పోలింగ్ ఏజెంట్లను ఎవరూ అడ్డుకోలేదు

● హెలికాప్టర్ ల్యాండింగ్ అనుమతులపైనా ఎలాంటి గందరగోళం లేదు: కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



కడప, మన జనప్రగతి, నవంబర్ 01:- జిల్లాలోని ఏడు పట్టణ స్థానిక సంస్థల్లో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని, పులివెందులలో పోలింగ్ ఏజెంట్లను ఎక్కడా అడ్డుకోలేదని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి స్పష్టం చేశారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనాతో కలిసి ఆయన పాత్రికేయులతో మాట్లాడారు.మాజీ ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్‌కు ఈ నెల 27వ తేదీనే అనుమతులు ఇచ్చామని, సమయ మార్పు నేపథ్యంలో కూడా ప్రయాణానికి ఆటంకం లేకుండా ఉదయం 9.45 గంటలకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. హెలికాప్టర్‌ను వెనక్కి మళ్లించాలని ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని స్పష్టం చేశారు.పులివెందులలోని 80 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 47 మంది ఏజెంట్లు ఉదయం 7 గంటలలోపే నమోదు చేసుకున్నారని తెలిపారు. కొందరు ఏజెంట్లు వ్యక్తిగత కారణాలతో మధ్యలో వెళ్లిపోయినట్లు సమాచారం ఉందన్నారు. ఏ ఒక్క ఏజెంట్‌ను కూడా అధికారులు అడ్డుకోలేదని పేర్కొన్నారు.అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని, ఏజెంట్లను బలవంతంగా బయటకు పంపినట్లు ఆధారాలు లేవని తెలిపారు.జిల్లాలోని ఏడు పట్టణ స్థానిక సంస్థల్లో 560 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ జరుగుతోందని, మధ్యాహ్నం 3 గంటల సమయానికి సుమారు 50 శాతం పోలింగ్ నమోదైందని వెల్లడించారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మకుండా ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

గెలిపిస్తే కనిగిరి మండల గ్రామాలను అభివృద్ధి చేస్తా...

● డ్రైనేజీ, సైడ్ కాలువల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● నందనమారెళ్లలో పర్యటించిన బీసీవై జెడ్పీటీసీ అభ్యర్థి వంగేపురం కార్తీక్ రాజు



కనిగిరి, మన జనప్రగతి నవంబర్ 01:- కనిగిరి మండల జెడ్పీటీసీ అభ్యర్థిగా తనను గెలిపిస్తే మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని బీసీవై పార్టీ అభ్యర్థి వంగేపురం కార్తీక్ రాజు తెలిపారు. ఆదివారం తన స్వగ్రామమైన నందనమారెళ్లలో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన సమస్యలను పరిశీలించారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ, సైడ్ కాలువల సమస్యలను స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. ఎన్నికల్లో తనకు అవకాశం కల్పిస్తే సైడ్ కాలువల నిర్మాణం, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన వృద్ధులకు వృద్ధాప్య పింఛన్లు అందేలా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని, గ్రామంలో స్మశానవాటికకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయించేందుకు ప్రయత్నిస్తానని పేర్కొన్నారు.ప్రజలు తనను ఆదరిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని కార్తీక్ రాజు అన్నారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుని తనకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా బీసీవై పార్టీ అధ్యక్షుడు సిరిమల్లె నరేంద్రబాబు, ముస్లిం మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ నజీర్ భాష, తేలుకుట్ల కళ్యాణ్ యాదవ్, నవీన్ కుమార్, డొక్కా రవి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో ఎంపీటీసీ అభ్యర్థుల ముమ్మర ప్రచారం

- రంగనాయకులపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన జనసేన బలపరిచిన అభ్యర్థి ముత్యాల కిషోర్



రైల్వేకోడూరు, మన జనప్రగతి నవంబర్ 01:- రైల్వేకోడూరు మండలంలో నవంబర్ 5వ తేదీన జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా రైల్వేకోడూరు రంగనాయకులపేట 5వ ఎంపీటీసీ స్థానానికి జనసేన పార్టీ బలపరిచిన అభ్యర్థి ముత్యాల కిషోర్ ఆదివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు .రంగనాయకులపేటలోని వివిధ వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ, బ్యాలెట్ పేపర్ లోని ఒకటవ సంఖ్య ,గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా రంగనాయకుల పేట లోఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంతో పాటు, రహదారులను (రోడ్లనూ)అభివృద్ధి చేసి వెడల్పు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రాంతంలోని ఇతర ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈ ప్రచార కార్యక్రమంలో ఆయనకు మద్దతుగా వార్డుకు చెందిన సుమారు వంద మందికి పైగా ప్రజలు పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ విధంగా ఆయనకు ప్రజలు మద్దతు మెండుగా కనిపిస్తుంది .ఏది ఏమైనప్పటికి ఎన్నికల నేపథ్యంలో రంగనాయకులపేటలో ఎంపీటీసీ అభ్యర్థుల ప్రచార సందడి నెలకొంది.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

లూథరన్ చర్చిలో వైసీపీ నేతల ప్రత్యేక ప్రార్థనలు

- చర్చి నూతన మందిర నిర్మాణానికి రూ.2.50 లక్షల విరాళం ప్రకటన



రైల్వేకోడూరు, మన జనప్రగతి, నవంబర్ 01:- రైల్వేకోడూరు పట్టణంలోని టోల్‌గేట్ సమీపంలో ఉన్న లూథరన్ చర్చిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పాస్టర్ ఆశీస్సులు తీసుకుని, సంఘ సభ్యులను కలుసుకున్నారు. రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో వైసీపీ బలపరిచిన అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.అనంతరం చర్చి నూతన మందిర నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు రూ.లక్ష, రామిరెడ్డి ధ్వజారెడ్డి రూ.లక్ష, జడ్పీటీసీ అభ్యర్థి అంబటి మురళి రూ.50 వేలు విరాళంగా ప్రకటించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సీహెచ్ రమేష్, పత్తి పెంచలయ్య, ప్రతాప్ రెడ్డి, రాజా (గని), ఇనమాల మహేష్, గండా సురేందర్ రెడ్డి, విఘ్నేష్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు, మన జనప్రగతి, నవంబర్ 01:- కర్నూలు జిల్లా పరిధిలోని నాలుగు పట్టణ స్థానిక సంస్థల్లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఆదివారం కర్నూలు నగరంతో పాటు ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరులోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.కర్నూలు కార్పొరేషన్ పరిధిలో గుర్తించిన 25 అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలు, సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్‌తో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఘర్షణలను నివారించేందుకు స్ట్రైకింగ్ ఫోర్సెస్, క్విక్ రియాక్షన్ టీమ్‌లు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నాయని తెలిపారు.పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నాయని, అల్లర్లకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకుని, ఓటు వేసిన వెంటనే ఇళ్లకు వెళ్లాలని కోరారు.ఎస్పీ వెంట డీఎస్పీ రాఘవేంద్ర, పలువురు సీఐలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అక్రమ ఎన్నికల ప్రక్రియకు ఆమోదముద్ర వేయలేను

- రీపోలింగ్ నిర్వహిస్తేనే ఓటు వేస్తా: వైఎస్ జగన్



పులివెందుల అర్బన్ జనప్రగతి నవంబర్ 01:- పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకోలేదు. ఎన్నికల ప్రక్రియపై నిరసనగా ఓటింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, పులివెందులలో ఎన్నికల పరిస్థితులు అప్రజాస్వామికంగా మారాయని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఓటు వేస్తే ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగిందనే భావన కలుగుతుందని, అందుకే ఓటు వేయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. న్యాయంగా, నిష్పక్షపాతంగా రీపోలింగ్ నిర్వహిస్తేనే తాను ఓటు వేస్తానని స్పష్టం చేశారు.ఎన్నికల సంఘం, అధికార యంత్రాంగం అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల నిర్వహణపై న్యాయస్థానాలను ఆశ్రయించి ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం న్యాయపోరాటం చేస్తామని జగన్ పేర్కొన్నారు.

అయ్యప్ప భక్తుల కోరిక మేరకు తులాభారం ప్రారంభం

- 300 మంది స్వాములకు ఉచిత వసతి కల్పన

- ఆలయ చైర్మన్ కొవ్వూరు రమేష్ రెడ్డి



ప్రొద్దుటూరు, మన జనప్రగతి, నవంబర్ 01:- ప్రొద్దుటూరు ఎర్రగుంట్ల రోడ్డులో పెన్నానది తీరాన ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తుల కోరిక మేరకు తులాభారం సేవను ప్రారంభించినట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ కొవ్వూరు రమేష్ రెడ్డి తెలిపారు.ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భక్తులు తమ మొక్కుల ప్రకారం బియ్యం, ధాన్యాలు, నగదుతో తులాభారం సమర్పించుకోవచ్చన్నారు. అయ్యప్ప మాలధారులకు ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రి భిక్ష ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.స్వాముల కోసం నిర్మిస్తున్న 'శివపార్వతుల సేవా సదన్'లో ఈ నెల 16 నుంచి సుమారు 300 మందికి ఉచిత వసతి కల్పించనున్నట్లు వెల్లడించారు. వసతి అవసరమైన అయ్యప్ప భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

రేణిగుంట సబ్‌డివిజన్‌లో నెల రోజుల పాటు సెక్షన్ 30 అమలు

● నవంబర్ 1 నుంచి 30 వరకు నిషేధాజ్ఞలు



రైల్వేకోడూరు, మన జనప్రగతి, నవంబర్ 01:- శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రేణిగుంట పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో నవంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు చేయనున్నట్లు డీఎస్పీ వై. శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. రేణిగుంట, గాజులమండ్యం, ఏర్పేడు, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేల్, పుల్లంపేట, పెనగలూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

పేద కుటుంబాలకు మూడు కుట్టు మిషన్ల పంపిణీ

- స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలి: వుయ్ హెల్ప్ యు ట్రస్ట్



కె.వి.పల్లి, మన జనప్రగతి, నవంబర్ 01:పేద కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించి మహిళలు స్వయం ఉపాధి పొందాలనే లక్ష్యంతో వుయ్ హెల్ప్ యు ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. పీలేరు నియోజకవర్గం కె.వి.పల్లి మండలం గోరంట్లపల్లి పంచాయతీ పరిధిలోని కమ్మిరెడ్డిగారిపల్లి ఎస్టీ కాలనీలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమలశెట్టి రమణ ఆధ్వర్యంలో, ఎం.వి. సతీష్ సహకారంతో లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ, మహిళలు కుట్టు పనుల ద్వారా ఇంటి వద్దే ఆదాయం పొందుతూ ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులోనూ నిరుపేద కుటుంబాలకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.కుట్టు మిషన్లు అందుకున్న మహిళలు ట్రస్ట్ నిర్వాహకులకు, దాత ఎం.వి. సతీష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ట్రెజరర్ సుశీల, జనరల్ సెక్రటరీ వులస రూప, సభ్యుడు సిబ్బాలా నాగరాజు, కాలనీవాసులు, ట్రస్ట్ సభ్యులు, యానాది సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- బి. క్యాంప్, ఏ. క్యాంప్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



కర్నూలు, మన జనప్రగతి, నవంబర్ 01:- ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పిలుపునిచ్చారు.ఆదివారం కర్నూలు నగరంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌ను ఆమె పరిశీలించారు. బి. క్యాంప్‌లోని ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, ఏ. క్యాంప్‌లోని మంటేశ్వరి పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటర్లకు కల్పించిన సదుపాయాలను తనిఖీ చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం కలెక్టరేట్‌లోని వెబ్‌కాస్టింగ్ కేంద్రం ద్వారా జిల్లావ్యాప్తంగా పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, ఆర్డీవో సందీప్ కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేష్ పాల్గొన్నారు.

కడప మున్సిపల్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ వైకాపా నేతల ఆరోపణలు

- పోలీసుల అండతో రిగ్గింగ్

- ఏజెంట్లపై దాడులు జరిగాయని విమర్శలు



కడప, మన జనప్రగతి, నవంబర్ 01:- కడప నగరపాలక సంస్థ ఎన్నికల పోలింగ్‌లో అధికార కూటమి నేతలు అక్రమాలకు పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. పోలింగ్ ఏజెంట్లను భయపెట్టి కేంద్రాల నుంచి బయటకు పంపించారని, దొంగ ఓట్లు వేయించారని విమర్శించారు.వైకాపా జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ, నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో తమ ఏజెంట్లను ఇబ్బందులకు గురిచేసి రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాషా మాట్లాడుతూ, ఓటర్ల గుర్తింపు, ఓటర్ స్లిప్పుల పంపిణీలో అక్రమాలు జరిగినా అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు.వైకాపా మేయర్ అభ్యర్థి బండి దీప్తి మాట్లాడుతూ, ఎన్నికల అక్రమాలపై కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆరోపించారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగి ఉంటే ఫలితాన్ని గౌరవంగా అంగీకరించేవారమని పేర్కొన్నారు.ఎన్నికల నిర్వహణపై చట్టపరంగా, ప్రజాక్షేత్రంలో పోరాటం కొనసాగిస్తామని వైకాపా నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, షేక్ ఉమర్, దాసరి శివ, పులి సునీల్ కుమార్, పి. రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రేణుక ఎల్లమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు



సిద్ధవటం, మన జనప్రగతి, నవంబర్ 01:- మండలంలోని మాచుపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ రేణుక ఎల్లమాంబ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున ఆలయ అర్చకులు సుబ్బరాజు ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు జలాభిషేకం, పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు కలగాలని ఈ సందర్భంగా అర్చకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పత్తికొండలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ ప్రారంభం



పత్తికొండ, మన జనప్రగతి, నవంబర్ 01:పత్తికొండలోని ఆదోని రోడ్డులో దర్గా సమీపంలో ఏర్పాటు చేసిన ప్రసాద్ ఆచారి హెచ్‌పీ పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవం ఆదివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎంపీపీ అభ్యర్థి బత్తిని లోకనాథ్, ఎంపీటీసీ-2, మాదాసి కురువ సంఘం తాలూకా అధ్యక్షుడు కె.పి. బ్రహ్మయ్య, ఎంపీటీసీ-3 భాస్కర్, 108 జిల్లా యూనియన్ ఉపాధ్యక్షుడు ఆలీ, నాలకదొడ్డి గ్రామ అధ్యక్షుడు బత్తిని రాజశేఖర్ తదితరులు హాజరయ్యారు.

సీపీఎం అభ్యర్థుల గెలుపునకు విస్తృత ప్రచారం

- ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎంకు మద్దతు ఇవ్వండి నేతలు



దేవనకొండ, మన జనప్రగతి, నవంబర్ 01:- దేవనకొండ మండలంలో సీపీఎం తరఫున పోటీ చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహించాయి. అలర్ దీన్నే, బంటుపల్లి, బేతపల్లి, దేవనకొండ, బండపల్లి గ్రామాల్లో ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు బి. వీరశేఖర్, రంగారెడ్డి మాట్లాడుతూ, పాలకులు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదని విమర్శించారు. స్వార్థ రాజకీయాలకు వ్యతిరేకంగా ఓటు వేసి, ప్రజాసేవకు కట్టుబడిన సీపీఎం అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శివశంకర్, అశోక్, పాండురంగడు,నాయుడు,నాగేంద్ర, దస్తగిరి, రాజు పాల్గొన్నారు.

పత్తికొండలో టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి సాంబశివారెడ్డి ప్రచారం



పత్తికొండ,మన జనప్రగతి నవంబర్ 01:-

పత్తికొండ పట్టణంలో టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి సాంబశివారెడ్డి కూటమి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని సుంకం గేటు, మార్కెట్ యార్డు ప్రాంతాల్లో పర్యటించి ఓటర్లను కలుసుకుంటూ తనకు మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రామ్మోహన్‌తో పాటు కూటమి నాయకులు పాల్గొని అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

వేంపల్లెలో ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కళ్యాణోత్సవం



వేంపల్లె మన జనప్రగతి నవంబర్ 01: – స్థానిక గాండ్లవీధి లోని ఆలయంలో ఆదివారం శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శాస్త్ర యుక్తంగా అర్చకుడు శేషగిరిరావు నేతృత్వంలో నాగ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కందుల ఐటిఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రావు సుజాత దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమం లో ఆలయ ప్రతినిధి శింగనమల సాంబశివుడు, భక్తులు పాల్గొన్నారు.

అపోలో ఫార్మసీస్‌లో 150 ఉద్యోగాలు

- నవంబర్ 2న పీలేరులో జాబ్ డ్రైవ్.. రూ.16 వేల నుంచి రూ.22 వేల వరకు వేతనం

పీలేరు, మన జనప్రగతి: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఏపీఎన్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీస్‌లో 150 పోస్టుల భర్తీకి జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నారు. నవంబర్ 2న ఉదయం 9 గంటలకు పీలేరులోని మార్గదర్శి డిగ్రీ కళాశాలలో ఈ ఎంపిక ప్రక్రియ జరగనుంది.ఫార్మసీ అసిస్టెంట్లు 50, ఫార్మసీ ట్రైనీలు 50, ఫార్మసిస్టులు 50 పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హతలను బట్టి నెలకు రూ.16,000 నుంచి రూ.22,000 వరకు వేతనం అందిస్తారు. పీలేరు, భాకరాపేట, రొంపిచెర్ల, సదుం, కల్లూరు, దామలచెరువు, పాకాల, రాయచోటి తదితర ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు.అభ్యర్థులు రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, నాలుగు పాస్‌పోర్ట్ ఫొటోలతో హాజరుకావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్. శ్యామ్ మోహన్ సూచించారు. వివరాలకు 6303578886 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కూటమి జడ్పీటీసీ అభ్యర్థిని గెలిపించండి



వేంపల్లె మన జన ప్రగతి నవంబర్ 01:- ప్రాదేశిక ఎన్నికల్లో భాగంగా వేంపల్లి జడ్పిటిసి కూటమి అభ్యర్థి బెస్త లక్ష్మీదేవిని గెలిపించాలని పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి డాక్టర్ హరీష్ ఓటర్లను కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం తన తల్లి జడ్పిటిసి అభ్యర్థి లక్ష్మీదేవితో కలిసి వేంపల్లి లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వీధి, శ్లోకా స్కూల్, పుల్లయ్య తోట తదితర ప్రాంతాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసిఈ నెల 5న జరిగే ఎన్నికల్లో గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ రవి శంకర్ పులివెందుల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చొక్కం మల్లికార్జున, దేవా, శ్యామ్, మనోజ్, గోసులఆంజనేయులు, సుధీర్ రెడ్డి, రాంకృష్ణ, బద్రినాథ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండలో సీపీఐ అభ్యర్థుల ప్రచారం జోరు



పత్తికొండ, మన జనప్రగతి, నవంబర్ 01:- పత్తికొండ పట్టణంలోని మడ్డిగేరి, కుమ్మరిగేరి ప్రాంతాల్లో 6, 7వ ఎంపీటీసీ స్థానాల సీపీఐ అభ్యర్థులు జి. నెట్టకంటయ్య, వాకిటి కవిత, వైసీపీ జెడ్పీటీసీ అభ్యర్థి పి. శ్రీరంగడు తరఫున శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. రామచంద్రయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో సీపీఐ, వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ పత్తికొండ అభివృద్ధికి కృషి చేసే అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.డప్పు కళాకారుల ఆటపాటలతో నిర్వహించిన ప్రచారంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమానికి స్పందన

- బర్కత్‌పురా హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రత్యేక శిబిరం



కాచిగూడ, మన జనప్రగతి, నవంబర్ 01:రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ బర్కత్‌పురా హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం నిర్వహించిన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పలువురు పట్టభద్రులు తమ విద్యార్హత పత్రాలతో హాజరై ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకున్నారు.బీఆర్ఎస్ బర్కత్‌పురా డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ బి. శిరీష ఓంప్రకాశ్, సీనియర్ నాయకులు డాక్టర్ బద్దుల ఓంప్రకాశ్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని ముఖ్య అతిథులు ఎన్. శరత్ శ్యామ్, టి. శేష్ నారాయణ్ పిలుపునిచ్చారు.నమోదు ప్రక్రియలో ఇబ్బందులు లేకుండా ఫారాల నింపడం నుంచి ఆన్‌లైన్‌లో వివరాల అప్‌లోడ్ వరకు సహకారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కాలనీ ప్రతినిధులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

ముడుంపాడులో కూటమి ప్రచారానికి ప్రజల స్పందన

- జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఇంటింటా ప్రచారం



సుండుపల్లి, మన జనప్రగతి నవంబర్ 01:- సుండుపల్లి మండలం ముడుంపాడు ప్రాంతంలో కూటమి అభ్యర్థుల తరఫున టీడీపీ, జనసేన నాయకులు నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి స్పందన లభించింది. చప్పిడి సోదరుల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటా తిరుగుతూ ఓటర్లను కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.కురవపల్లి, పెద్దపల్లి, తొగురుపల్లి హరిజనవాడ, కందలవాండ్లపల్లి, ముడుంపాడు కస్పా, తిమ్మారెడ్డిగారిపల్లి హరిజనవాడ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. సుండుపల్లి జడ్పీటీసీ కూటమి అభ్యర్థి బుక్కే మంగెనాయక్, ముడుంపాడు ఎంపీటీసీ అభ్యర్థి బుక్కే సురేష్ నాయక్ తరఫున నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు కంచన రెడ్డిశేఖర్, చెన్నంశెట్టి చిన్న సిద్ధయ్య, పసుపులేటి కృష్ణయ్య, సుబ్బయ్య, జనసేన నాయకులు మచ్చా లక్ష్మీనారాయణ, ఫయాజ్, మున్నా, అశోక్, ధనశేఖర్‌తో పాటు పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు

- ఓటు వేయకుండా వెనుదిరగడం రాజకీయ పిరికితనానికి నిదర్శనం



అమరావతి,మన జనప్రగతి నవంబర్ 01:-పులివెందుల పులినని చెప్పుకునే వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సొంత నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకోకుండా వెనుదిరగడం రాజకీయ పిరికితనానికి నిదర్శనమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు.ఆదివారం పులివెందుల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన స్పందిస్తూ, ఓటమి భయంతోనే వైసీపీ ఎన్నికలను వివాదాస్పదం చేస్తోందని ఆరోపించారు. పోలింగ్ సందర్భంగా రాళ్ల దాడులు, ఘర్షణలు, జర్నలిస్టులపై దాడులు జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు.ఓటర్లను అడ్డుకుంటున్నారనే ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి, హింసకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పులివెందుల ప్రజలు ఎవరికీ బానిసలు కారని, ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణేతలు ప్రజలేనని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు.

వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్‌ను పరిశీలించిన కలెక్టర్ నిశాంత్ కుమార్

- పటిష్ట పర్యవేక్షణతో జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు



మదనపల్లి,మన జనప్రగతి నవంబర్ 01:-మదనపల్లి, పుంగనూరు మున్సిపాలిటీల పరిధిలో ఆదివారం జరిగిన పోలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు.పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళి, సిబ్బంది విధులు, ఓటర్ల రాకపోకలను పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రధాన కంట్రోల్ రూమ్‌ను సందర్శించి పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, ఓటర్లకు కల్పించిన సౌకర్యాలను సమీక్షించారు.ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ సమన్వయంతో చేపట్టిన పర్యవేక్షణ, భద్రతా ఏర్పాట్ల మధ్య జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేష్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు

● ప్రభుత్వ యంత్రాంగం ఎన్నికల నిర్వహణలో విఫలం: రాచమల్లు



ప్రొద్దుటూరు, మన జనప్రగతి నవంబర్ 01:- రాష్ట్రంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీతో కలిసి ప్రభుత్వ వ్యవస్థలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశాయని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆరోపించారు. ఆదివారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితులు కల్పించడంలో ప్రభుత్వం, ఎన్నికల సంఘం విఫలమయ్యాయని విమర్శించారు.ఎన్నికల సందర్భంగా మహిళా ఓటర్లు, పోలింగ్ ఏజెంట్లను అడ్డుకోవడం, పలు ప్రాంతాల్లో దాడులు, అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. జమ్మలమడుగులో పోలింగ్ ప్రారంభమైన నాలుగు గంటల్లోనే 60 శాతం ఓటింగ్ నమోదైనట్లు ప్రకటించడంపై సందేహాలు వ్యక్తం చేశారు. అనంతపురంలో రిగ్గింగ్ జరిగినట్లు ఆరోపించారు.ఎన్నికల సంఘం, పోలీసు శాఖ, జిల్లా అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలను వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు.2029 ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు ద్వారా ప్రభుత్వానికి సమాధానం చెబుతారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాచమల్లు శివప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు.

ప్రకృతి వనరుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- వైవీయూలో సుస్థిర జీవనశైలి వారోత్సవాలు ప్రారంభం



కడప, మన జనప్రగతి నవంబర్ 02:- ప్రకృతి వనరులను సంరక్షిస్తూ ఇంధన వినియోగం, వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించాలని యోగి వేమన విశ్వవిద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ ఏజీ దాము సూచించారు. ఆదివారం వైవీయూలో బ్రిక్స్ సస్టైనబుల్ లైఫ్‌స్టైల్ వీక్2026 వారోత్సవాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం నడక, వ్యాయామం అలవర్చుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలని సూచించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.సి. గంగిరెడ్డి మాట్లాడుతూ తగినంత నీరు తాగడం, పోషకాహారం తీసుకోవడం, సానుకూల దృక్పథంతో జీవించడం ఆరోగ్యానికి ఎంతో అవసరమన్నారు.వారోత్సవాల నోడల్ అధికారి ప్రొఫెసర్ ఎం. సుభాష్ చంద్ర మాట్లాడుతూ యోగా, ధ్యానం, వ్యాయామం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చన్నారు. బొటానికల్ గార్డెన్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎ. మధుసూధన్ రెడ్డి ప్రకృతి, మొక్కల సంరక్షణ ప్రాముఖ్యతను వివరించారు.అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు వృక్షాలను ఆలింగనం చేసుకుని వాటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్ రాజగోపాల్ రెడ్డి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులు సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందాలి: డైరెక్టర్ విజయ ప్రకాష్



వేంపల్లె మన జన ప్రగతి నవంబర్ 01: ట్రిపుల్ ఐటీ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందాలని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య విజయప్రకాష్ అన్నారు. ట్రిపుల్ ఐటీ లో ఆదివారం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చిప్ నోవా ఎక్స్ట్రీర్ డిజైన్ ఇంప్లిమెంట్ పేరిట వి ఎల్ ఎస్ ఐ సాంకేతిక కార్యశాల నిర్వహించారు. వర్క్ షాప్ ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ భాస్కరరావు నేతృత్వంలో విద్యార్థులకు వివిఎల్ఎస్ఐ రంగంలోని సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రాక్టికల్ అమలుతో అనుసంధానం చేయడం, విద్యార్థులకు డిజిటల్ డిజైన్ వెరిలాగ్ ఆర్టిఏ డిజైన్ వెరిఫికేషన్ పై అవగాహన కల్పించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ వివిఎల్ఎస్ ఐ,సెమీ కండక్టర్ రంగాల్లో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం డిజిటల్ డిజైన్ విషయంలో విద్యార్థులు పూర్తి అవగాహన సాధించాలన్నారు. ఏవో చల్లారత్నకుమారి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ బి వి సుధాకర్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వై అరుణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవనబండ, పత్తికొండలో వైసీపీ ఎన్నికల ప్రచారం



పత్తికొండ, మన జనప్రగతి, నవంబర్ 01:- పత్తికొండ మండలం దేవనబండ గ్రామంతో పాటు పత్తికొండ పట్టణంలోని ఎంపీటీసీ7 పరిధిలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ దేవనబండ గ్రామంలో ప్రచారంలో పాల్గొని ప్రజలను ఓట్లు అభ్యర్థించారు.ఈ సందర్భంగా శ్రీదేవమ్మ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించి ప్రజల అభ్యున్నతికి కృషి చేశామని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో, సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమైందని విమర్శించారు.అనంతరం పత్తికొండ పట్టణంలోని ఎంపీటీసీ7 పరిధిలో మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, సీపీఐ నాయకులతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, జడ్పీటీసీ అభ్యర్థికి ఫ్యాన్ గుర్తుపై, ఎంపీటీసీ అభ్యర్థికి కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్ దాడిని తిప్పికొడదాం!

దేశంలో అశాంతి సృష్టించేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోంది: బీజేపీ నాయకులు

కరీంనగర్, మన జనప్రగతి, నవంబర్ 01:అధికారం కోల్పోయిన నిరాశతో కాంగ్రెస్ దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని బీజేపీ నాయకులు విమర్శించారు. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఆదివారం కరీంనగర్, మానకొండూరు, హుజూరాబాద్, చొప్పదండి నియోజకవర్గాల్లో 'ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం.. అరాచక శక్తులను తరిమికొడదాం' అనే నినాదంతో మేధావులు, ప్రభావశీల వ్యక్తుల సదస్సులు నిర్వహించారు.జమ్మికుంటలో జరిగిన హుజూరాబాద్ నియోజకవర్గ సదస్సులో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ అనవసర ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టిస్తోందని విమర్శించారు.మానకొండూరు, చొప్పదండి నియోజకవర్గాల సమావేశంలో మంచిర్యాల జిల్లా







ఇన్‌చార్జి కన్నబోయిన ఓదెలు మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే ఓటర్ల జాబితా సవరణ జరుగుతోందని తెలిపారు. బోగస్, రెండుసార్లు నమోదైన, మరణించిన వారి ఓట్ల తొలగింపుపై ప్రతిపక్షాలు అపోహలు వ్యాప్తి చేస్తున్నాయని ఆరోపించారు.కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర విభాగాల కన్వీనర్ సారంగుల అమర్‌నాథ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాంగ్రెస్ ఆరోపణలపై ప్రజలకు వాస్తవాలు వివరించాలని మేధావులను కోరారు.ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మాడ వెంకట్‌రెడ్డి, గుజ్జు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు ఈనుగొండ నాగేశ్వర్‌రెడ్డి, గుర్రాల వెంకటరెడ్డి, నరసింహారాజు, సంపత్‌రావు, రాపాక ప్రవీణ్, సుగుర్తి జగదీశ్వరాచారి తదితర నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో 82 ఏళ్ల వృద్ధుడు మృతి

- అతివేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఘటన..



గంగాధర, మన జనప్రగతి, నవంబర్ 01: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకంపల్లి గ్రామ శివారులోని పిట్టలపల్లి వై జంక్షన్ వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో 82 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడు. వెంకంపల్లికి చెందిన సంకటి మల్లయ్య తన ద్విచక్ర వాహనంపై మధురానగర్ ఎక్స్‌రోడ్డు వైపు వెళ్తుండగా, ఎదురుగా అతివేగంగా, నిర్లక్ష్యంగా వచ్చిన స్విఫ్ట్ డిజైర్ కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన మల్లయ్యను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పందిర్ల జగదీశ్వర్ శర్మగా గుర్తించారు. మృతుడి కుమార్తె కొమటిరెడ్డి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గంగాధర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు.

ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ ర్యాలీ

- ఢిల్లీలోని రాంలీలా మైదానంలో 'ఓట్ బచావోదేశ్ బచావో' నిరసనలో పాల్గొన్న ప్రణవ్‌బాబు

న్యూఢిల్లీ/హుజూరాబాద్, మన జనప్రగతి, నవంబర్ 01:'ఇండియా' కూటమి, రాహుల్‌గాంధీ పిలుపు మేరకు న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన 'ఓట్ బచావోదేశ్ బచావో' నిరసన ర్యాలీలో హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నాయి. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు ఆధ్వర్యంలో కమలాపూర్ మండల నాయకులు, కార్యకర్తలు ర్యాలీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రణవ్‌బాబు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తోందని, ఓటరు జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం





కలిగిస్తోందని ఆరోపించారు. ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తీసుకుంటున్న ఏకపక్ష



నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని, ఆయన తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పౌరుడి ఓటు హక్కును, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ప్రజాస్వామ్యవాదులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలోనూ ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈనెల 04, 05న నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ఉమ్మడి కరీంనగర్లో పర్యటన





కరీంనగర్, మన జనప్రగతి, నవంబర్ 01: ఎంఐఎం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నట్లు, ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 04న కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో, 05న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో ప్రభుత్వ ఉర్దూ మీడియం హైస్కూల్స్ లో ఎస్సీస్సీ చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ గైడ్స్ ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమానికి ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఉర్దూ మీడియం స్కూళ్లలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు, సాలారే మిల్లత్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ రిలీఫ్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా పంపిణీ చేసే ఈ ఆల్ ఇన్ వన్ గైడ్స్ ను, మోడల్ క్వశ్చన్ పేపర్లను స్వీకరించేందుకు పెద్ద ఎత్తున విద్యార్థులు తరలిరావాలని, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గులాం అహ్మద్ హుస్సేన్ కోరారు.

గుజరాత్‌లో ఏక్తా దివాస్ పరేడ్‌లో పాల్గొన్న కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్

కమలాపూర్ మన జనప్రగతి, నవంబర్ 01: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ గౌడ్ గుజరాత్ రాష్ట్రంలో జరిగిన ఏక్తా దివాస్ పరేడ్ లో పాల్గొన్నారు.భారతదేశ తొలి ఉపప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని గుజరాత్ రాష్ట్రంలోని నర్మదా జిల్లా ఏక్తా నగర్ లో నిర్వహించిన జాతీయ ఏక్తా దివాస్ పరేడ్ లో హన్మకొండ జిల్లా కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ పాల్గొన్నారు.గుజరాత్ రాష్ట్రంలోని కెవాడియా (ఏక్తానగర్) లో రాష్ట్రీయ ఏక్తా దివస్ ఉత్సవ్ కు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ఆహ్వానితులను ఆహ్వానించారు.హన్మకొండ జిల్లా నుంచి పబ్బ సతీష్ (సర్పంచ్, కమలాపూర్),కోడిమాల శ్రీనివాసరావు (పూర్వ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్), ఉత్తమరాజు వికాస్(సమాజ సేవకుడు), ఒంటెల నికితాంజలి (వ్యాపార రంగం), సాయికిరణ్ రాథోడ్(విద్యార్థి కేయూ)ఎంపికైన వీరంతా గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి నోడల్ ఆఫీసర్ ఆరెపల్లి సుమన్



ఆధ్వర్యంలో గుజరాత్ కు తరలివెళ్లి స్టాట్యూ ఆఫ్ యూనిటీ(సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం) సందర్శించి శుక్ర, శనివారం రెండు రోజుల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరైన వేడుకల్లో వీరు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. వేడుకల అంతరం ఆదివారం వారు హనుమకొండ కు తిరుగు ప్రయాణం అయ్యారు.ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించిన హన్మకొండ జిల్లా కలెక్టర్ చహత్ భాజ్ పాయ్ కు, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.



శ్వేత రెడ్డి కు, పలు శాఖల అధికారులకు,కేంద్ర ప్రభుత్వం, గుజరాత్ ప్రభుత్వంకు సర్పంచ్ పబ్బు సతీష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నాకు ఈ అరుదైన గౌరవం పొందే వేడుకల్లో ఆహ్వానితులు గా పాల్గొనడం గొప్ప అవకాశంగా భావిస్తున్నానని అన్నారు.ఈ కార్యక్రమం తో మా టీం సభ్యులకు దేశం,సమాజం పట్ల మా బాధ్యత మరింత పెరిగిందన్నారు.

ఢిల్లీ రామ్ లీలా మైదానంలో 'ఓట్ బచావో.. దేశ్ బచావో' నిరసన ర్యాలీ

- పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ



న్యూఢిల్లీ, మన జనప్రగతి, నవంబర్ 01: ఢిల్లీ రామ్ లీలా మైదానంలో ఈరోజు నిర్వహిస్తున్న 'ఓట్ బచావో.. దేశ్ బచావో' నిరసన ర్యాలీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.ఓటు హక్కును కాపాడుకుంటూ దేశ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ నిరసన ర్యాలీకి దేశవ్యాప్తంగా ప్రజల నుండి భారీ మద్దతు లభిస్తోంది.

డిప్యూటీ ఈఈగా పదోన్నతి.. విశిష్ట సేవా పురస్కారం

- కడారి వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం
- పడమటి లోకవరం గ్రామానికి గర్వకారణం


కల్లూరు, మన జనప్రగతి, నవంబర్ 01:పంచాయతీరాజ్ శాఖలో ఏఈగా విధులు నిర్వహిస్తూ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డిప్యూటీ ఈఈ)గా పదోన్నతి పొంది వైరాకు బదిలీపై వెళ్లిన పడమటి లోకవరం గ్రామానికి చెందిన కడారి వెంకటేశ్వర్లుకు గ్రామస్థులు ఘనంగా సన్మానం చేశారు. ఆయనకు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విశిష్ట సేవా పురస్కారం 2026 లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆదివారం పడమటి లోకవరం గ్రామంలో మాజీ సర్పంచ్ కళ్యాణపు కొండలరావు, 9వ వార్డు మహిళా



కౌన్సిలర్ కళ్యాణపు నవ్య దంపతుల ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే తన సొంత గ్రామమైన పడమటి లోకవరం అభివృద్ధికి వెంకటేశ్వర్లు ఎల్లప్పుడూ సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఆయనకు ప్రతిష్ఠాత్మకమైన విశిష్ట సేవా పురస్కారం లభించడం గ్రామానికే గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహిస్తూ, ప్రజలకు మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కడారి వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలిపారు.

కోతుల నుంచి పంటను కాపాడుకునేందుకు పెట్టిన విద్యుత్ ఉచ్చు..

- రైతునే బలితీసుకుంది...! • కురవి మండలం నల్లెల్లలో విషాదం



కురవి మన జనప్రగతి, నవంబర్ 01: కోతుల బెడద నుంచి తన పంటను కాపాడుకుందామని రైతు వేసిన ఎత్తుగడే అతని ప్రాణాలను బలితీసుకున్న విషాద ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నల్లెల్ల గ్రామంలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే... నల్లెల్ల గ్రామానికి చెందిన రైతు పల్లా రాంరెడ్డి తనకున్న 8 ఎకరాల్లో వరి సాగు చేశాడు. పంట ఏపుగా పెరుగుతున్న తరుణంలో కోతులు గుంపులుగా వచ్చి పంటను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో తట్టుకోలేని రాంరెడ్డి తన పొలం చుట్టూ రక్షణ కోసం అక్రమంగా విద్యుత్ తీగను ఏర్పాటు చేశాడు.శనివారం కోతులు ఆ విద్యుత్ తీగకు తగలడంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి, తీగ తెగి రైతు నడిచే బాట వరకు పడిపోయింది. విద్యుత్ ప్రవహిస్తున్న విషయాన్ని గమనించని రైతు రాంరెడ్డి ప్రమాదవశాత్తు ఆ తీగను తొక్కడంతో అక్కడికక్కడే విద్యుదాఘాతంతో మృతి చెందాడు.దాంతో నల్లెల్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న సీరోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పంటల రక్షణ పేరుతో ఇలా ప్రాణాలకు తెగించి అక్రమ విద్యుత్ తీగలు ఏర్పాటు చేయవద్దని విద్యుత్ శాఖ అధికారులు రైతులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట వైఎస్ జగన్ ధర్నా

ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ ఆందోళన

ఏజెంట్లను బలవంతంగా బయటకు పంపుతున్నారని ఆరోపణ

అధికారుల కోసం కార్యాలయం వద్ద నిరసన



పులివెందుల, మన జనప్రగతి, నవంబర్ 01:- పులివెందుల మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. పోలింగ్ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బలవంతంగా బయటకు పంపుతున్నారని, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తూ దొంగ ఓట్లు వేస్తున్నారని వైసీపీ నాయకులు ఆరోపించారు.ఆదివారం మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కొనసాగుతున్న సమయంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పలు పోలింగ్ కేంద్రాల్లో తమ పార్టీ ఏజెంట్లకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ వైసీపీ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో పులివెందుల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మ తొలుత మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు.పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్నాయని ఆరోపిస్తున్న పరిణామాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లేందుకు ఆమె కార్యాలయానికి వచ్చినట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి.

అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, దుశ్శాంత్ రెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు.అయితే ఫిర్యాదులు స్వీకరించాల్సిన సంబంధిత ఎన్నికల అధికారులు కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో వైసీపీ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో చోటుచేసుకుంటున్నాయని చెబుతున్న అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు వచ్చినప్పటికీ బాధ్యత కలిగిన అధికారులు అందుబాటులో లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తమ ఫిర్యాదులను స్వీకరించి తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో కార్యాలయం బయట మహిళలతో కలిసి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధర్నాలో పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లను తొలగించడం, ఓటర్లను ఓటు వేయకుండా అడ్డుకోవడం, దొంగ ఓట్లు వేయడం వంటి ఆరోపణలపై ఎన్నికల యంత్రాంగం వెంటనే స్పందించాలని కోరారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వైసీపీ నాయకులు పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియలో ఏవైనా అక్రమాలు చోటుచేసుకుంటే వాటిపై ఫిర్యాదులు స్వీకరించి, సంబంధిత ఆధారాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో తమ పార్టీ ఏజెంట్లకు రక్షణ కల్పించాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని కోరారు.మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ, ఇతర వైసీపీ నాయకులు మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా చేపట్టడంతో అక్కడ రాజకీయంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కార్యాలయం పరిసరాల్లో కొంతసేపు గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలు పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో మరింత చర్చనీయాంశంగా మారాయి.

తిరుగుబాటు అభ్యర్థులు తప్పుకోకుంటే సస్పెన్షన్ తప్పదు

● కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలి: డాక్టర్ బాలాజీ



చిట్వేలి, మన జనప్రగతి, నవంబర్ 91:కూటమి పార్టీలకు చెందిన తిరుగుబాటు అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకొని, పార్టీ అధిష్టానం నిర్ణయించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థుల విజయానికి సహకరించాలని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, తిరుపతి జిల్లా ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ బాలాజీ హెచ్చరించారు. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పోటీలో కొనసాగితే క్రమశిక్షణ చర్యలతో పాటు సస్పెన్షన్ తప్పదని స్పష్టం చేశారు.ఆదివారం చిట్వేలి మండలం నాగవరంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల మధ్య ఐక్యతే విజయానికి కీలకమని పేర్కొన్నారు. వ్యక్తిగత విభేదాలు, కుల, బంధుత్వాలకు అతీతంగా కూటమి అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కేకే చౌదరి, ముక్కా రూపానంద రెడ్డి, తాతంశెట్టి నాగేంద్ర, జడ్పీటీసీ అభ్యర్థి ఆనాల సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


గోవిందవాడ అభివృద్ధే లక్ష్యం: సోమనాథ్ గౌడ్

- సైకిల్ గుర్తుకు ఓటేసి మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి




బొమ్మనహాల్, మన జనప్రగతి, నవంబర్ 91:- బొమ్మనహాల్ మండలం గోవిందవాడ ఎంపీటీసీ-1 టీడీపీ అభ్యర్థి పి. సోమనాథ్ గౌడ్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ, వారి సమస్యలను తెలుసుకుని సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎన్నికల బరిలో నిలిచానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మార్గదర్శకత్వంలో గోవిందవాడ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నవంబర్ 5న జరిగే ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ ప్రచారంలో మాజీ ఎంపీటీసీ కావలి వేమన్నతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ సహాయకుడు గురుస్వామి కన్నుమూత



బొమ్మనహాల్ మన జనప్రగతి నవంబర్ 01 :-బొమ్మనహాల్ మండలం బొలనగుడ్డం గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకుడు (తలారి) గురుస్వామి (58) తీవ్ర అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు, ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన బొలనగుడ్డం గ్రామానికి తరలించారు,నేడు ఉదయం గ్రామంలో అంత్యక్రియ లు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు,గురుస్వామి మృతి పట్ల బొమ్మనహాల్ మండల గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


ఓటు హక్కును వినియోగించుకున్న మంత్రి నారాయణ



నెల్లూరు మన జనప్రగతి నవంబర్ 01:- నగరపాలక సంస్థ ఎన్నికల్లో మంత్రి నారాయణ నెల్లూరు రూరల్ హరనాథపురంలోని 25/4 పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ప్రజలందరూ విధిగా ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటు హక్కు మన బాధ్యత అని, ప్రజలకు సేవ చేసేవారికే ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని మంత్రి నారాయణ కోరారు.

ఓటు హక్కు వినియోగించుకున్న అభిరుచి మధు దంపతులు

● ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి కీలకం



నంద్యాల మన జనప్రగతి నవంబర్ 01:-నంద్యాల మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. పోలింగ్ కేంద్రానికి ఆయన తన సతీమణితో కలిసి వెళ్లి, స్థానికంగా ఉన్న బూత్‌లో ఓటు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అనేది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత కీలకమైన హక్కు అని అభిరుచి మధు ఈ సందర్భంగా పేర్కొన్నారు.


కడప జిల్లాలో 70.06 శాతం పోలింగ్ నమోదు

- జమ్మలమడుగు మున్సిపాలిటీలో అత్యధికంగా 78.50 శాతం ఓటింగ్

కడప, మన జనప్రగతి, నవంబర్ 01:జిల్లాలో పట్టణ స్థానిక సంస్థల రెండో సాధారణ ఎన్నికలు2026 పోలింగ్ ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని ఏడు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మొత్తం 172 వార్డులకు ఎన్నికలు నిర్వహించగా, 4,39,035 మంది ఓటర్లకు గాను 3,07,594 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో జిల్లా మొత్తంగా 70.06 శాతం పోలింగ్ నమోదైంది.మున్సిపాలిటీల వారీగా పరిశీలిస్తే జమ్మలమడుగులో అత్యధికంగా 78.50 శాతం, బద్వేల్‌లో 80.30 శాతం, ఎర్రగుంట్లలో 73.70 శాతం, మైదుకూరులో 72.10 శాతం, పులివెందులలో 70.60 శాతం, కడప నగరపాలక సంస్థ పరిధిలో 69.47 శాతం, రాజంపేటలో 58.30 శాతం పోలింగ్ నమోదైంది.మొత్తం పోలింగ్‌లో పురుషుల ఓటింగ్ శాతం 74.21 కాగా, మహిళల ఓటింగ్ శాతం 67.26గా నమోదైంది. ఇతరుల విభాగంలో 2 శాతం పోలింగ్ నమోదైనట్లు తుది గణాంకాలు వెల్లడించాయి.జిల్లాలో అత్యధికంగా బద్వేల్‌లో 80.30 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా రాజంపేటలో 58.30 శాతం నమోదైంది. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో అభ్యర్థుల భవితవ్యం ఓటింగ్ యంత్రాల్లో నిక్షిప్తమైంది.

ఎన్డీఏ కూటమి అభ్యర్థి సులోచన విస్తృత ప్రచారం

● గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని జనసేన నాయకుల విజ్ఞప్తి




ఆదోని మన జనప్రగతి, నవంబర్ 01: మంత్రాలయం ఎంపీటీసీ-3 స్థానం ఎన్డీఏ కూటమి అభ్యర్థి బి. సులోచన రాఘవేంద్ర నగర్‌లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి తరఫున పోటీ చేస్తున్న ఆమెకు గాజు గ్లాసు గుర్తుపై, జడ్పీటీసీ అభ్యర్థికి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ప్రజలను కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ప్రచారంలో వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి వాల్మీకి బి. లక్ష్మన్నతో పాటు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్

- కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ



కడప టౌన్ మన జనప్రగతి, నవంబర్ 01:- వైఎస్సార్ కడప జిల్లాలోని ఏడు పట్టణ స్థానిక సంస్థల్లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.ఆదివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితులను సమీక్షించి అధికారులకు సూచనలు చేశారు.జిల్లాలోని 560 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైందని, వీటిలో 335 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా, పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు.పోలింగ్ అనంతరం బ్యాలెట్ పెట్టెలను భద్రతా గదులకు తరలించేందుకు చర్యలు తీసుకున్నామని, నవంబర్ 3న ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు.

హుతాత్మ దివస్ సందర్భంగా రక్తదాతల నమోదు శిబిరం

- పటాన్‌చెరులో ఉచిత రక్తగ్రూపు పరీక్షలు



పటాన్‌చెరు, మన జనప్రగతి, నవంబర్ 1:హుతాత్మ దివస్‌ను పురస్కరించుకుని బజరంగ్ దళ్ పటాన్‌చెరు ఆధ్వర్యంలో ఉచిత రక్తగ్రూపు పరీక్షలు, రక్తదాతల నమోదు శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువకులు, స్థానికులు పాల్గొని రక్తగ్రూపు పరీక్షలు చేయించుకోవడంతో పాటు స్వచ్ఛంద రక్తదాతలుగా పేర్లు నమోదు చేసుకున్నారు.అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండేలా ఈ శిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దధీచి మహర్షి, అయోధ్య రామజన్మభూమి ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన కొఠారి సోదరుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ జిల్లా, విభాగ నాయకులు ఆర్‌వీఎస్ రవి, శ్రీధర్, మనోజ్, సాయి తేజ, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174